**కడుపులో నొప్పి-నొప్పి-నొప్పి-ఈ నొప్పి ప్రాణాలు తీస్తోంది మీనాక్షిని. మీనాక్షి ఒక్కతే ఉంది ఇంట్లో. అస్పత్రికి వెళ్ళే ఓపికగానీ తోడుగానీ, లేదు.**

ఒక్కతే ఆ మూడు గదుల ఇంట్లో మధ్యగదిలో మంచంమీద పడి కొట్టుకుంటోంది. ఏడవడానిక్కూడా శక్తిలేదు. అక్కడికి తెలిసిన మాత్రలు అలమారులో వెతికి తీసి వేసుకుంది. తగ్గినట్టేతగ్గి ఎక్కువై పోతోంది. మంచంమీద దుప్పటి అంతా ఉండ చుట్టుకుపోయింది.

మళ్ళీ కష్టపడి లేచి అ పురలో బిళ్ళలు తీసి రెండు వేసుకుంది. ఒక్కరవ్వ తగ్గిందనిపించాక మళ్ళీ వస్తే తట్టుకోలేనేమోననిపించి నెమ్మదిగా లేచి చీర మార్చుకుని తలుపులు తాళాలు వేసి దగ్గరనున్న పాతిక రూపాయలు పర్సులో వేసుకుని రిక్షా ఎక్కింది.

ఆ దగ్గరలోనే మూడంతస్తుల బిల్డింగ్‌కి వైద్యశాల అని బోర్డు చూసినట్లు గుర్తు తనకి. ఆ బోర్డు ప్రక్కన మరో బోర్డుమీద ఎనిమిది పేర్లు—వాటి పక్కన పేర్లకు మించిన పొడుగాటి డిగ్రీలు. చాలారోజుల నాడు ఆ బోర్డు చూసి తనూ, శంకరం నవ్వుకున్నారు. అది గుర్తొచ్చింది.

రిక్షా అక్కడ దిగింది. లోపలకెళ్ళగానే విశాలమైన వరండా. అందులో బెంచీలు. ఎటూకాని వేళ, ఒకరిద్దరు మాత్రమే వున్నారు. తనూ వెళ్ళి కూచుంది. బ్లూ అంచు తెల్లచీర కట్టుకున్నావిడ ఆయాలా వుంది. దగ్గరకి వచ్చి— "ఏమ్మా! ఏం కావాలి!" అంది.

"డాక్టరుగారు!" అంది మీనాక్షి.

"ఏ డాక్టరుగారు? ఇదివరకు వచ్చారా మీరు?"

"లేదండి రాలేదు. పొద్దుటనించి కడుపులోనొప్పి. చూపించుకుందామనివచ్చాను" అంది మీనాక్షి

"కడుపులో నొప్పా! వేళగాని వేళ రాకపోతే పొద్దునే రాకూడదూ!"

"రెండు మూడు టాబ్లెట్లు వేసుకున్నానండి తగ్గుతుందేమోనని!"

"సర్లెండి రండి. డ్యూటీ డాక్టరుగారు ఉన్నారు."

మీనాక్షి ఆమెను అనుసరించింది. మళ్ళీ కడుపులో సన్నగా తెరలు తెరలుగా నొప్పి. ఆ నొప్పి వస్తుందంటేనే గుండెలు దడదడలాడుతున్నాయి. డాక్టరుగారి రూములోకి తీసికెళ్ళి కూర్చోబెట్టింది ఆయా. పేషెంట్లు ఎవ్వరూ లేనందువల్లనేమో డ్యూటీ డాక్టరు పర్సనల్ రూమ్‌లో నిద్రపోతున్నట్లుంది. ఆయా వెళ్ళి తీసింది. సన్నగా- పొట్టిగా ఇంటర్మీడియెట్ చదువుతున్న పిల్లల్లే వుందనుకుంది మీనాక్షి. అంతచిన్న వయసులో డాక్టరు అయిందని ముచ్చటేసింది కూడా.

ఆ అమ్మాయిని చూసిన ఒక్కక్షణంలో ఎన్ని ఆలోచనలో. 'తనకీ ఇంటర్‌లో 70% వచ్చాయి మార్కులు. ఎంట్రెన్స్‌కి వాళ్ళ దగ్గిరా వీళ్ళ దగ్గిరా బిట్ పేపర్స్ తెచ్చుకుని చదివింది కూడా.

అగ్రకులంలో పుట్టడం- నాన్న చేసే గుమాస్తా గిరికి తనని అయిదేళ్ళు చదివించే ఓపికలేకపోవడం -ప్ర-ప్రభుత్వం అప్పు కూడా ఇస్తుందట. అయినా ఆ అప్పుకోసం ఎన్ని తిప్పలు పడాలో-డాక్టరు అవ్వాలంటే ఎన్ని గండాలు దాటాలి!'

"చీటీ తీసుకోమ్మా! అయిదు రూపాయలు యివ్వు!" అంది ఆయా!

సంతోషపడింది మీనాక్షి. అయిదురూపాయలు ఫీజయితే ఏ పది రూపాయలకో మందులు రాస్తారు. మిగతా పదితో ఆయన క్యాంపునుంచి వచ్చేదాకా గడపొచ్చుననుకుంది.

చీటీమీద నంబరు, పేరూ రాసింది ఆయా. "ఈ చీటీ సంవత్సరంవరకు పనికొస్తుంది" అంది ఆయా.

"లోపల బల్లమీద పడుకోబెట్టు" డాక్టరమ్మ.

లోపల బల్లమీద పడుకొంది మీనాక్షి.

పెళ్ళయి రెండో ఏడు. తన వయస్సు యిరవై. ఇంతవరకు యిలా ఆస్పత్రి బల్లమీద పడుకొనే అవసరం రాలేదు. భయం భయంగా పడుకుంది.

పైపొట్ట నొక్కి చూసింది. నొప్పి ఎక్కడని అడిగింది. ఎక్కడ నొప్పో సరిగా చెప్పలేకపోయింది మీనాక్షి. పొత్తికడుపు నొక్కి చూసింది. ఇప్పుడూ చెప్పలేక పోయింది మీనాక్షి. వాష్ బేసిన్ దగ్గరకెళ్ళి చేతులు వాష్ చేసుకుని గ్లవ్స్ వేసుకుంది. అక్కడి ఓ స్టాండ్ మీద ఇరవై జతల గ్లవ్స్ - తెల్లని టర్కీ నేప్‌కిన్స్ వున్నాయి. డెట్టాల్ వాసన, స్పిరిట్ వాసన- ఆస్పత్రి వాతావరణం చాలా శుభ్రంగా వుంది.

'అమ్మ ఎవరింటికేనా వెళ్ళొస్తే 'అద్దంలా మెరిసిపోతోందే నేల. పాలు ఒలికిపోస్తే ఎత్తుకోవచ్చు' అనేది.

'మూడు గదుల ఇంట్లో నానమ్మ. తాతయ్య అమ్మ, నాన్న. పిల్లలు నలుగురు. నేలంతా నాపబండలు అక్కడక్కడా జాయింట్లు సిమెంటు ఊడిపోయి ఇసక బయటకొచ్చి కాళ్ళకింద గరగరా అంటూ పాలుకాదుగదా నూనె ఒలికినా ఎత్తుకోడానికి వీల్లేకుండా-చిరాగ్గా-ఊడ్చిన వాళ్ళ



ఊడ్చినట్లే వుందేవాళ్ళు–' మీనాక్షికి చిన్నప్పట్నుంచీ ఆలోచించడం అలవాటు.

గ్లవ్స్ తొడుక్కుని వచ్చింది డాక్టరమ్మ "లోపల పరీక్ష చెయ్యాలమ్మా సరిగా పడుకో" అంది అరుణ.

పి. వి. చేయడానికి అనువుగా పడుకో బెట్టింది మీనాక్షిని ఆయా. లోపల పరీక్ష చేసింది డాక్టరమ్మ.

కాపురమైతే చేస్తోంది. భర్తనైతే చేర నిస్తోందిగానీ పరాయి మనిషి ముందు ముడుచుకుపోయింది మీనాక్షి. గాభరాగా ఉంది.

"భయంలేదమ్మా! ఉండు. సరిగ్గా పరీక్ష చెయ్యద్దా!" అంటూ నిదానంగా పరీక్షచేసింది డాక్టరమ్మ.

'ఇంత చిన్నపిల్ల - ఈ పిల్లకి సిగ్గని పించదూ!' అనుకుంది మీనాక్షి.

కళ్ళు-నాలిక కూడా పరీక్ష చేసింది డాక్టరమ్మ. కార్డుమీద ఏదో రాసింది- "నాలిగింటికి పెద్దడాక్టరుగారు వస్తారు. ఈలోపుగా ఇంజక్షను ఇస్తాను, నిద్రవడుతుంది" అంది డాక్టరమ్మ.

నరానికి ఇంజక్షనిచ్చింది.

"బయట బల్లమీద పడుకోమ్మా!" అంది.

మీనాక్షి నెమ్మదిగా నడిచి బయట బల్లమీద ఒరిగింది. మెలకువ వచ్చేసరికి చుట్టూ బల్లనిండా మనుషులు కూర్చుని ఉన్నారు. తెల్లని చీరలలో నర్సులు కాబోలు అటూ ఇటూ తిరుగుతున్నారు.

గోడగడియారం నాలుగు గంటలుకొట్టింది. సరిగ్గా బయట తెల్లఫియట్ ఆగింది. అందులోంచి జానెడు వెడల్పు జరీ అంచు గద్వాల్ చీర కట్టుకున్నావిడ హుందాగా దిగింది. పెద్దచుట్ట చుట్టుకుని దానిమీద పూలు పెట్టుకుంది. మీనాక్షికి జమీందారిణి వేషంలో ఎస్. వరలక్ష్మి గుర్తొచ్చింది.

ఆఫీసు రూమ్‌లోకి వెళ్ళనావిడను చూసి 'ఓహో! డాక్టరన్నమాట' అనుకుంది మీనాక్షి.

ఆవిడ లోపలికెళ్ళిన అయిదు నిముషాలకి నర్సొచ్చి మీనాక్షిని లోపలికి పిలిచింది. లోపల పెద్ద డాక్టరమ్మ దగ్గర బుల్లి డాక్టరమ్మ, ఇందాక ఆయా తన దగ్గర నిలబడ్డట్టు నిలబడి ఉంది.

మళ్ళీ పిల్ల డాక్టరు చేసిన పరీక్షలన్నీ చేసిందావిడ. ఇంకొంచెం ఎక్కువ సేపు పట్టింది. బి పి. టెంపరేచర్ కూడ చూసింది.

"ఏమ్మా! ఎన్నాళ్ళనించి ఈ నొప్పి నీకు?"

"ఈ రోజే ఎక్కువగా వుందమ్మా! అప్పుడప్పుడు వచ్చినా ఇంత తీవ్రంగా రాదు" అంది మీనాక్షి.

"ముందు రక్తం, యూరిన్, మోషన్ పరీక్షలు చేయించండి. తర్వాత మందులు అవీ రాసిస్తాను. టెంపరరీగా తగ్గడానికి ఇంజక్షను ఇస్తాను" అంది డాక్టరమ్మ.


"అలాగేనండి!" మీనాక్షికి ఈ పరీక్షలవీ అన్నాక ఇదేదో గొప్ప జబ్బేమోనని గుండెల్లో రాయి పడింది.

అలాగేనని తలూపుతూ లేచి బయట కొచ్చింది.

బయట నర్సు "రెండు ఇంజక్షన్లకు ఆరు రూపాయలు ఇవ్వండమ్మా" అంది.

ఆరు రూపాయలు తీసిచ్చింది మీనాక్షి.

"ప్రక్కనే రక్త పరీక్ష చేస్తారు." అంది నర్సు.




ఓ చీటీ మీద ఈ పరీక్షల తాలూకు వివరాలు రాసిచ్చింది డాక్టరమ్మ. మరో ఇంజక్షను చేసింది జబ్బకు.

"వీలైతే ఈ పూటే పరీక్షలు చేయించెయ్యండి. ఆలస్యం చెయ్యద్దు" అని కూడ హెచ్చరించిందావిడ.

రోడ్డుమీదకొచ్చి ఆస్పత్రి కుడిప్రక్క ఉన్న క్లినికల్ లో లాబొరేటరీలో అడుగు పెటింది అనాలోచితంగా. అక్కడో బోయ్ చీటీ తీసికొని యూరిన్, రక్తం తీసికొని. "మోషన్ రేపొద్దున్న తెండమ్మా! రేపు సాయంత్రానికికల్లా అన్ని రిపోర్టులు ఇచ్చేస్తాము'' అన్నాడు.

"ఎంతవుతుంతండి ?"

"పాతిక రూపాయలు."

మీనాక్షి దగ్గర ఇంకా పత్నాలుగు రూపాయలే వున్నాయి. అలాగేనని చెప్పి యింటి వైపు నడిచింది. రిక్షాకి కూడా డబ్బు, ఖర్చు పెట్టబుద్ధి కాలేదు ఇంటి కొచ్చిందన్న మాటేగాని మనస్సు మనస్సులో లేకుండా పోయింది. ఏ ఆలోచనా లేదు మెదడులో — తన కొచ్చిన జబ్బు మీద తప్ప. దిగులు పట్టుకుంది.

'ఎంత జబ్బు కాకపోతే ఇన్ని పరీక్షలు! బోలెడంత ఖర్చయిపోయింది. ఎక్కడ్నించి తేవాలో! ఈయన కూడా లేరు ఊళ్ళో — కాంపు నుంచి ఎప్పుడొస్తారో ఏమో' అనుకుంటూ మధ్యాహ్నం మిగిలిన మజ్జిగ తాగి పడుకుంది.

కంటిమీద కునుకు రావటంలేదు. ఒక్కసారిగా దుఃఖం వస్తోంది.

తెల్లవారుజామున వచ్చాడు శంకరం. కాంపులో సడన్‌గా ప్రోగ్రాం మార్చుకున్న ఆఫీసర్‌తో పాటు వెనక్కొచ్చేశాడు.

మీనాక్షి ప్రాణం లేచొచ్చింది. పెనిమిటిని చూసి ధైర్యమొచ్చింది. కంగారుపడిపోయాడు శంకరం. విషయమంతా విన్నాక భయమేసింది.

ఎనిమిదింటికల్లా మోషన్ టెస్ట్‌కిచ్చి ఆస్పత్రికెళ్ళారు. శంకరానికి పాతికేళ్ళుంటాయి. ఒంటరికాపురం. అన్నిటికీ ఖంగారు, భయం.

నిన్న మీనాక్షిని చూసిన డాక్టరమ్మ మళ్ళీ నాలుగింటికిగాని రాదట. 'సాయంత్రం రిపోర్టులు కూడా తీసుకురండి, ఆవిడ నాలుగింటికి వస్తారని చెప్పింది, నర్సు.

నాలుగింటి దాకా టెన్షన్. సరిగ్గా భోజనాలు కూడా చెయ్యలేకపోయారు. సరిగ్గా పావుతక్కువ నాలుగింటికి బయలుదేరి ఆస్పత్రికి చేరుకున్నారు.

ఎస్ వరలక్ష్మి మార్కు డాక్టరమ్మ తాపీగా అయిదింటికి వచ్చింది. మొదటి కేసంటే మీనాక్షి.

రిపోర్టులన్నీ చూసి - మళ్ళీ లోపల అంతా పరీక్ష చేసి నిదానంగా "ఆపరేషన్ చెయ్యాల్సొస్తుంది" అంది.

అదిరిపడ్డాడు శంకరం.

"ఏం లేదు, గర్భ సంచి కొంచెం పక్కకు తొలగినట్టుంది. చిన్నాపరేషను చేస్తే పోతుంది" అంది.

"ఎప్పుడు చేస్తానంటారు?" అన్నాడు శంకరం.

"ఎప్పుడైనా పరవాలేదు."

"మావాళ్ళకి రాసి ఎవరినైనా పిలిపించుకోవాలిగదండి."

"మీ యిష్టం. ఏదైనా రెండు మూడు రోజుల్లోపల చేస్తే మంచిది" అందావిడ.

"రేపొద్దున వస్తామమ్మా అయితే" అంది మీనాక్షి — ఎప్పుడీ ఆందోళన నించి బయటపడదామా అనే ఆత్రుత యిద్దరికీ వుంది.

"రేపు సాయంత్రం నాలుగున్నరకి ఆపరేషను చేస్తాను" అంది డాక్టరమ్మ.

"అలాగేనండి" — శంకరం, మీనాక్షి లేచారు.

బుల్లి డాక్టరమ్మను పిలిచి. 'మిస్ రమా! రేపు నాలుగ్గంటలకి ఈ అమ్మాయికి డి అండ్ సి. బి రెడి" అని చెప్పి "నువ్వు రేపొద్దున కాఫీ తప్ప ఏం తీసుకోకు. తొమ్మిదింటికల్లా వచ్చి ఆస్పత్రిలో జాయినవ్వు" అంది మీనాక్షితో.

శంకరం ఆ రాత్రి నాలుగు బజారుల అవతల వున్న వాళ్ళక్కయ్యకు విషయం చెప్పి మర్నాడు పొద్దున రమ్మన్నాడు.

మీనాక్షిని మర్నాడు ప్రొద్దున ఆస్పత్రిలో చేర్చారు. ఆ సాయంత్రం అయిదింటికల్లా ఆపరేషను అయిపోయింది. ఆపరేషను టేబిల్ దగ్గర అసిస్ట్ చేసిన మిస్ రమాదేవికి అసలా గర్భసంచిలో ఆపరేషను చెయ్యాల్సినంత అవసరమేమిటో అర్థంకాలేదు. డి అండ్ సి చెయ్యాలని పెద్ద డాక్టరమ్మ చెప్పినప్పుడే రమకి ఆ సందేహం వచ్చింది. ఉండబట్టలేక ఆపరేషన్ అయ్యాక చేతులు వాష్ చేసుకుంటున్న డాక్టరమ్మగారిని అడిగేసింది.

డాక్టరమ్మగారు 'వెర్రిదానా' అన్నట్టు ఓ చూపు చూసి "స్టిల్ యూ ఆర్ ఏ బిగినర్!" అంది.

'అవును. నేను నేర్చుకోవాలసింది చాలా వుంది' అనుకుంది రమ.

మర్నాడు ప్రొద్దున్నే ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు మీనాక్షిని.

మందుల షాపులో బిల్లు — డాక్టరమ్మగారి బిల్లు — నర్సులకి — ఆయాలకి అన్నీ ఇచ్చుకుని బయటపడ్డారు శంకరం - మీనాక్షి.

"మీనాక్షీ! మెళ్ళో గొలుసేది?" అని అడిగిన ఆడపడుచుకి ఏం చెప్పాలో అర్థంగాక తెల్లమొగం వేసింది మీనాక్షి.

"తెగిపోతే బాగుచెయ్యడానికి యిచ్చాను అక్కయ్యా!" అన్నాడు శంకరం - మధ్యతరగతి మందహాసం ఒకటి చేస్తూ.

ఆ రోజు రాత్రి డాక్టరమ్మ గారింట్లో లెక్కలు చూసుకుంటున్నారు. మందుల కొట్లోంచి డాక్టరమ్మ గారి అన్న కొడుకూ, క్లినికల్ లాబొరేటరీనించి ఆడపడుచు కొడుకూ లెక్కలు తెచ్చి అప్పచెప్తున్నారు.

ఆ బిల్లుల్లో మీనాక్షి రక్తపరీక్షబిల్లు, శంకరం మందులు కొన్న బిల్లు కూడా వున్నాయి. ఆస్పత్రి లెక్కలో ఓ రోజు రూమ్ అద్దె, బెడ్ ఛార్జీలు మీనాక్షి పేరన వున్నాయి. ఏ లెక్కకూ రాని డాక్టరమ్మ గారి ఫీజు ఆవిడ మెదడులో మీనాక్షి పేరన వుంది. అయిదు రూపాయలచీటీ రిజిస్టరులో ఇక శాశ్వతంగా మీనాక్షి పేరు వుంటుంది.

డాక్టరమ్మ రమాదేవి అడిగిన ప్రశ్న గుర్తొచ్చి నవ్వుకుంది. ●



## ఆశావాది



అస్తమించే సూర్యునిలో
అంతులేని ఆత్మ విశ్వాసం. రేపు
తూరుపున ఉదయిస్తానని.

ఆకులు రాలిన మోడులో
ఏదో ధైర్యం. మళ్ళీ
వసంతంలో చిగురిస్తానని.

వేసవిలో ఎండిన నదిలో
నిండుగా నమ్మకం. తిరిగి
పొంగి ఉరకలేస్తానని.

కష్టాలలో ఈదుతున్న నాలో
ఏ మూలో చిన్న ఆశ
సుఖాల తీరం చేరుతానని.

—'సీను'